# వరుణదేవుని కక్ష

**కథానిక**

రాధేయ

ప్రకృతి పై పగబట్టిన వరుణ దేవుడు ఎడతెగని వర్షంలో సమస్త లోకాన్నీ జలమయం చేస్తున్నాడు. వరదలతో నదులు పరవళ్ళు త్రొక్కుతూ, కోపోద్రేకమున నాలికలు చాస్తున్నాయి నీటి అలలు. ఆ వరదల్లో తల్లులూ, పిల్లలూ చెట్టుకొకరూ పుట్టకొకరూ అయ్యారు. అక్కడక్కడా శోకంతో నిలిచిపోయాయి పూరెమ్మలు విరబూయకుండా. ఆశాభంగం పొందిన వసంత కన్య శోక దేవతే అయింది. సందడిగా సంచరించే జనులంతా ఈ బీభత్సాన్ని చూడలేక తలుపులు బిడాయించుకొన్నారు.

మిద్దెలు, మేడలున్న వారి కెలాంటి ఆపాయమూ లేదు కానీ, నది గట్టునున్న పూరిగుడిసె లన్నిటినీ తనలో కలుపుకొంది ఆ అనంత జలప్రవాహం. ఆ రోజు అర్ధరాత్రికి పెరిగిన నీటి మట్టం పీడ్చేందుకు వీలులేకుండా, ఎదిరించేందుకు శక్తిలేకుండా అందరినీ కాజేసింది. వారం రోజుల నుండి ఎడతెగని వర్షం వల్ల పనులు లేక పస్తులున్న పూరిగుడిసెల్లోని పేదలందర్నీ ఒడిలోకి తీసుకుంది. చుట్టూ పరిసరాలు గుర్తుపట్టలేని విధంగా మారిపోయాయి.

ఎవరక్కడ ?

....సమాధానం రాలేదు..

నిన్నే.. పిల్చేది వినపడలేదా — ఈసారి గద్దించాడు వాచ్‌మన్.

నేనే బాబు! వీరయ్యను...

ఇంత రాత్రి వేళ ఆ గట్టున ఏం చేస్తున్నావ్? లే.. లే వెళ్ళిపో.. ఈ రోజు నిన్నటి కంటె ఇంకా ఎక్కువ నీటి మట్టం పెరిగే సూచన వుంది. వెళ్ళిపో వెంటనే ... హెచ్చరించాడు వాచ్‌మెన్.

అవతల నుంచి జవాబు రాలేదు..

అరె.. నీక్కాదు చెప్పేది, వెళ్తావా లేవా?

ఎక్కడ కని వెళ్ళను బాబయ్యా...

ఎక్కడైన తల దాచుకో.. ఇక్కడుంటే చాలా ప్రమాదం.. నిన్న రాత్రి నీరు ఎక్కువై ఆ ప్రక్కనున్న గుడిసెలన్నీ కొట్టుకొని పోయాయి! ఎంత మంది పోయారో అంతే తెలియడం లేదు...

ముడతలు పడ్డ వీరయ్య ముఖంతో విరక్తితో గూడిన మందహాసం మెరిసింది ఆ క్షణం. కానీ ఆ చీకటిలో వాచ్‌మన్ గమనించలేకపోయాడు.

ఒక్క రోజు తను లేకపోయే సరికల్లా ఎంత ఘోరం జరిగిపోయింది? పస్తులున్న భార్యాబిడ్డల్ని చూడలేక పొరుగూరికి పనికి పోయి సంతలో సరుకులు తీసుకొని ఆత్రంగా ఇంటికి తిరిగొచ్చాడు.. వచ్చి చూస్తే..

ఇంకేముంది! మహా ఘోరం జరిగిపోయింది. భార్యాబిడ్డల జాడలేదు.. పూరి పాక ఆమూకి అసలే లేదు..

ఇదంతా తనకేమీ పట్టనట్లు నిండు గర్భిణీలా ఒరుసుకుంటూ ప్రవహిస్తోంది నది..

ఈ దారుణ సంఘటన వీరయ్యను పిచ్చి వాణ్ణి చేసింది. కాళ్ళ క్రింద భూమి పాతాళంలోనికి క్రుంగిపోతున్నట్లనిపించింది. భూకంపం వచ్చి తాను కూడా పోయివుంటే

బాగుండుననిపించింది.. తన వాళ్లంతా వెళ్లి పోయినప్పుడు తను మాత్రం ఒక్కడూ ఈ భూమిపైన ఎవరి కోసం బ్రతకాలి?..

అనుకున్నదే తడవుగా వడివడిగా అడుగులేస్తూ నడిచాడు నది ఒడ్డుకు. కానీ అంతలో మెదడులో ఓ ఆలోచన తళుక్కున మెరిసింది. తన వారు ప్రాణాలతో ఎక్కడైనా ఒడ్డుకు చేరుకున్నారేమో నన్న సందేహంతో అడుగులు ఆగిపోయినయ్.

తన వాళ్లు బ్రతికి బయట పడితే ముడుపు కట్టుకొని దర్శిస్తామని ఏడు కొండల వానికి మ్రొక్కుకున్నాడు వీరయ్య నిశ్చలమైన మనస్సుతో.

ఆ రాత్రంతా నిద్ర పట్టలేదు వీరయ్యకు. రెండు రోజుల క్రిందట కాస్త గంజి త్రాగినట్లు కూడా గుర్తు లేదు. ఆకలి ధ్యాసే లేదు.. కన్ను మూస్తే తన వాళ్ల దీనాలాపన, కళ్లు తెరిస్తే ఎడ తెగని వర్షం..

ఎట్లాగో ఆ రోజు తెల్లవారింది కానీ ఆ భయంకర వాతావరణానికి భయపడి సూర్యుడు కూడా రాలేదు.. ఎప్పటిలాగే సన్నగా తుంపరలు పడుతూనే వున్నాయి. ఆవేదనతో ఆత్రంగా మళ్లీ నది ఒడ్డుకు వచ్చాడు వీరయ్య. అటు వైపు సంచరించే జనమైనా తన వారి ఆచూకి ఏమైన విన్నారేమోనని !

ఏరా వీరయ్యా ! ఎంత అన్యాయం జరిగి పోయిందీ ? మన వాళ్లంతా గంగమ్మకు బలి అయినారని విని చాలా బాధపడిపోయాను.. అటుగా వెళ్తున్న సరుకుల కొట్టు యజమాని వీరయ్యను చూచి జాలిని నటిస్తూ అన్నాడు..

పోయిన వాళ్లతోటి మనమూ పోతామా ఎంటిరా ! ఎందుకు బాధపడి పోతావు ? గవర్నమెంటు వరదల పాలైన మీ కుటుంబాలను ఆదుకుంటుందని ఈ రోజు పేపరులో వేశారు.. అని అటుగా వస్తున్న మునసబు.

అంత కంటే వాళ్లు ఇంకేం చేస్తారు.. మా కన్నీళ్లు తుడవటానికి.. అనుకున్నాడు వీరయ్య.

అదేంటిరా, ఈరిగా, ఎక్కడి కెళ్తున్నావు ?... వేప పుల్లతో పళ్లు తోముకుంటూ ఎదురొచ్చాడు గంగులు.

ఎవరి మాటలు తను పట్టించుకోలేదు. ఎవరి సానుభూతి కోసం ఎదురు చూడ్డంలేదు.

నేరుగా ఈతగాళ్ల దగ్గరకి పోయాడు.

బాబు ! ఈ రోజు మావాళ్ల జాడ ఏమైన తెలిసిందా ? చెప్పండి బాబు !

లేదు వీరయ్యా, ఎంత ప్రయత్నించనా మేం వారిని రక్షించలేక పోయాం, ఎక్కడా బయటపడలేదింకా. రేపో.. ఎల్లుండో శవాలైనా తేల వచ్చునేమో.

మరుసటి రోజంతా ఆ ఒడ్డున కూర్చున్నాడు అనంత జలప్రవాహం వైపు ఆశగా చూస్తూ.

రా...ఇంకెందుకు ఆలస్యం? నీవూ మాతో కలిసిపో అంటూ పిలుస్తున్నాయి నీటి కెరటాలు.

రేపు ఒక్క రోజు ఆగు మావాళ్లెక్కడైన తేలుతారేమో.. అంటూ సమాధాన మిచ్చింది వీరయ్య అంతరాత్మ, భగవంతుడు అన్యాయం చెయ్యడన్న ప్రగాఢ విశ్వాసంతో.

ఏరా.. నీక్కాదూ చెప్పేది. .అన్యాయంగా చచ్చిపోతావని చెబుతుంటే లెక్కచేయకుండా కూర్చున్నావే !

ముందు అక్కణ్ణుంచి కదులు, లేక నన్నే రమ్మంటావా ? ఈసారి వాచ్‌మన్ గర్జనకు చలించి లేచాడు వీరయ్య.

నా ప్రాణాల మీద నాకే తీపి లేప్పుడు ఈయనగారికేమిటో నా మీద ఇంత దయ..అనుకుంటూ నడిచాడు.

కూడు లేదు గూడు లేదు మరి ఈ అర్ధరాత్రి ఎక్కడ కని వెళ్లాలి? ఎవరు చోటిస్తారు... ఇదే ఆలోచన తనకు.

ఎయిర్ కూల్డ్ మేడల్లో ఆదమరచి నిదరబోతున్న ధనవంతుల ప్రతీకల్లా వున్నాయి నీడ నివ్వలేని వీధి లైట్లు. చెట్టు క్రిందనైనా తల దాచుకుందా మంటే వర్షానికి తోడుగా నీటితో తడిసి ఆకులు గాలికి మరిన్ని జల్లులను విదిలించేస్తున్నాయి.

తెల్లవారితే మూడవ రోజు

ఎట్లాగో.. గాలైనా.. వానైనా.. భరిస్తాను ఈ రోజు.. రేపటి కైనా ఆచూకి తెలియక పోతుందా.. అను కుంటూ తడుస్తూ నడుస్తున్నాడు వీరయ్య.

కప్పలు, కీచురాళ్ల అరుపులతో బీభత్సంగా వుంది. సమస్త ప్రకృతి భయంకరమైన ఆ రేయి గడిచిపోయింది.

తెల్లవారింది యధావిధిగా..

యధాప్రకారం ఈతగాళ్లను కలుసు కున్నాడు.

ఎప్పటిలా అదే ప్రశ్న వేశారతను. అదే జవాబు వారిది.

అక్కడ ఒక్క క్షణం కూడా నిలువ బుద్ధిపుట్ట లేదు.

అదేంటి వీరయ్యా! ఎందుకలా గట్టు దగ్గరగా పోతున్నావు? కట్టు తిరిగి పడిపోతావ్ జాగ్రత్త. అక్కడి కెళ్లకు. ఇలా రా.. అంటూ వారు కేకేశారు. కాని వీరయ్య వినలేదు.

వీరయ్యా! మా మాట విను! అక్కడ నీళ్లు చాలా లోతుగా ఒరుసుకుంటూ పారుతున్నాయ్ - వద్దు అక్కడ కెళ్లకు. అయినా లెక్క చెయ్యలేదు.

రెప్పపాటులో నీటిలో దబేల్ అన్న శబ్దంతో పాటు వీరయ్య కూడా కలిసి సుళ్లు తిరిగి పోయాడు ఆ ప్రవాహంలో.

ఈ ఘోరం చూస్తున్న ఈతగాళ్లు తమ ప్రాణాలు కూడా లెక్క చెయ్యక నదిలో దూకి వీరయ్యను రక్షించటానికి విశ్వ ప్రయత్నం చేశారు.

కాని అప్పటికే అందరికీ అందనంత దూరంగా వెళ్లి పోయాడు.. వెతికి.. వెతికి.. వేసారి.. చేసేది లేక ఒడ్డుకు చేరుకున్నారు వారు.

కన్నీటికి, కష్టాలకు ఎదురీది తన వారిని విడిచి పెట్టలేక నీటిపాలైన వీరయ్య , కళేబరాల్లాంటి వన్నీ వారం రోజులకల్లా మరో ఒడ్డుకు విసరివేయబడ్డాయి.

కక్ష సాధించు కొన్న వరుణ దేవుడు తన కోపాన్ని ఉపసంహ రించు కున్నాడు అప్పటికి!

బూర్జువా విప్లవం విజయవంతం కావడం శ్రామిక వర్గానికి లాభం. బూర్జువా వర్గ అధి కారం, బూర్జువా వర్గంతో పోరాడడానికి ఒక సరికొత్త ఆయుధాన్ని శ్రామిక వర్గం చేతుల్లో వుంచుతుంది. అంతే కాదు. గుర్తింపు కలిగించి దానికో కొత్త హోదా కల్పిస్తుంది.

కారల్ మార్క్స్